# సింపిల్ 'అర్థ'మెటిక్

పిల్లలు చేసే లెక్కల్లోకూడా ఆడాళ్ళను తక్కువపరచి మగాళ్ళను, వాళ్ళ అధిక్యతను హెచ్చుచేసే ప్రాబ్లమ్స్‌వుంటాయి. అసలు ఆడదే ఒక ప్రాబ్లెం కదా — మళ్ళీ యీ వీపుగోకడాలు గిల్లడాలు ఎందుకు చెప్పండి? మా అమ్మాయి మావార్ని లెక్క చెప్పమని అడిగితే — పురుషులలోకి మార్చుకుంటే ఆన్సరు వస్తుందే అమ్మాయీ అన్నారు. నాకు చెడ్డకోపం వచ్చింది. ఆన్సరు వస్తే వస్తుంది—రాకపోతే రాదు. పురుషులలోకి మార్చొద్దు. స్త్రీలలోకే మార్చిచెయ్యవే అని నేను యాంగ్రీగా చెప్పాను. మావారు - చెప్పొద్దూ — కొంచెం తగ్గారు. డవునయినట్లు మొహం పెట్టి "స్త్రీలలోకి మార్చుకున్నా ఆన్సరు వస్తుందే" అన్నారు. అలా రండి దారికి అనుకున్నాను.

ఈ లెక్కల పుస్తకాలను చూస్తుంటే నాకు మగాళ్ళమీద చిర్రెత్తుకొస్తుంది. చూడండి ఏం న్యాయం వుందో.... ముగ్గురు పురుషులు చేయుపని ఐమగురు స్త్రీలు చేయుపనికి సమానము. ఒకస్త్రీ చేయుపని ఇద్దరు బాలురు చేయుపనికి సమానము. డోంటాక్ రాట్— (పురుషులు చేసేపన్లు స్త్రీలు చేయలేరు. స్త్రీలు చేసేపన్లు పురుషులు చేయలేరు. ఇద్దరూ కలిసి చేసేపన్లు రాయడానికి వీల్లేదు) ఒక స్త్రీ చేయుపని ఇద్దరు బాలురు చేయుపనికి సమానంట—ఎంత తప్పు? యిలాటి తప్పుడుకూతలు లెక్కలపేరిట పుస్తకాలలోకి ఎక్కించినవాళ్ళను గోడకుర్చీ వేయించాలి. వాళ్ళపేర్లు గవర్నమెంటుకి చెప్పి బ్లాక్ లిస్టులో వేయించాలి.

ఒక గోడను ఐదుగురు పురుషులు, పదిమంది స్త్రీలు, నలుగురు బాలురు కలిసి 8 రోజులలో కట్టిన ఆ గోడను తొమ్మిదిమంది పురు

షులు, ఎనిమిదిమంది స్త్రీలు, ముగ్గురు బాలురు కలిసి ఎన్ని రోజులలో కట్టగలరు? ఇంత తెలివితక్కువ లెక్క భూప్రపంచకంలో వుండదు.

అసలింతమంది ఆడాళ్ళూ, పురుషులూ గోడపక్కకెందుకు చేరటం? చేరితే, బ్రహ్మకైన వచ్చు రిమ్మతెగులు....ఆడదానిజూడ అర్థంబు జూడగ — దట్సాల్! ఇదివరకు ఐదుగురు పురుషులు, పదిమంది స్త్రీలు, నలుగురు బాలురు కలిసి కట్టిన గోడను మళ్ళీ వీళ్ళెందుకు కట్టాలి? అసలు మునుపటివాళ్ళు గోడకట్టకుండా మరేవిటి చేశారు? వాళ్ళుచేసినట్టు వీళ్ళు చేయరని నమ్మకమేమిటి? ఈ బాలురెందుకు మధ్యలో చెడిపోటానికి పానకంలో పుడకల్లాగ. ఇంతమంది మనోవ్యాపారం అరికట్టడం కష్టవా? గోడ కట్టడం కష్టవా? చెప్పరేం గురూగారూ అన్నా! అని కళ్ళలోకి సూటిగా చూశా. మావారికి 'భృకుటీకరించడం — నిశ్వసించడం' వచ్చులెండి. ఎవరైనా గురూగారూ అన్నపుడు మావారు పొంగిపోతారు ష్యూర్! మనం అంటే మొగమంతా కాళిమ చేసుకుంటారు. కాళిమ అంటే తెలీదూ — బెంగాలీ నవలలోంచి మొహం మీదపడ్డ పాదధూళిని తుడిచేస్తే కనిపిస్తుంది. సెంటిమెంటుని విరిచేసి పొయ్యిలోపెట్టి—మంచి కన్నులరాణి నవలల్లోలాగ ఓవర్‌కోటు మీదేసుకుని (బెజవాడ సమ్మర్లో ఫైర్‌ప్లేస్‌కేసి తిరిగి చేతులు కాల్చుకుంటూ (అంటే వంటని కాదు, వెచ్చ చేసుకోవడమని) మనిషికేసి తిరిగి మొహంకేసిచూడకుండా మాట్లాడడం డెన్నిస్ రాబిన్స్ నవలల్లోలాగ ఆ మానర్స్ ప్రాక్టీస్ చేయరాదా అంటా? ఫైర్‌ప్లేసు కావాలంటే బొగ్గు రాజేసి కుంపట్లోపోసి కిటికీలో పెడ్తా.

ఇలా అంటే మా వోల్డుమాన్ భుజాలు ఎగరేస్తారు ఇంగ్లీషు సినిమాల్లోలాగ. ష్రగ్గిడ్ హిజ్ షోల్డర్సు అంటారట. ఆడాళ్ళుకూడా భుజాలు ఎగరేస్తారా ఇంగ్లీషు నవలల్లో—ఏమో నాకు తెలీదు. అన్నట్లు స్త్రీ పురుష సమానత్వం గురించి సూత్రప్రాయంగా లెక్కల పుస్తకాల్లో మార్పు తీసుకురావాలని నా ఐడియా. అంటే—ఒక స్త్రీ వ్రాయు నవల లేదా చీరియల్ (చీరనుంచి వచ్చిన శబ్దంకాదు చీరియల్. చీరియో అను

ఆంగ్లపదాన్ని సవరిస్తే ఆహ్లాదంకలిగించేది కనుక చీరియల్ అని ఎందు కనకూడదు?) యిజిక్వల్టూ పదిమంది పురుషులు వ్రాయు కథలకు సమానము. ఒక పురుషుడు వ్రాయు నవల ( చీరియల్ కాదు ) ఒకటీ బై వెయ్యోవంతు చీరియల్‌కు సమానము, ఒక స్త్రీ ఒకచీరియల్‌ను 8 నిమిషాల్లో వ్రాస్తే అది 12 వారాల్లో ఎనభై వేలమంది చదివితే 90నిమిషాల్లో ఎన్ని చీరియల్స్ వ్రాస్తుంది? ఎంతమంది పాఠకులు ఎన్నివారాల్లో చదువుతారు? ఇలా సవరించాలి. లెక్కల్నుగాని బ్లడీ గోడ కట్టడం కాదు. మరో రూలుంది. చీరియల్సు రాసినవాళ్ళు పైకెళ్ళిపోతారు. కథ వ్రాసే వాళ్ళు అడుక్కెళ్ళిపోతారు (అడుక్కు తింటారని కాదు). గోడ కట్టేవాడు పైకెళ్ళిపోతాడు. నూయి త్రవ్వేవాడు అడుక్కెళ్ళిపోతాడు. (శాన్ స్క్రిట్‌లో అలా వుంది) గేయాల్రాసేవాడు అడ్డంగా సిమెంటుస్లాబులు పోసినట్లు విస్తరిస్తాడు. విమర్శలు వ్రాయడం అంటే గోతులు త్రవ్వడమే కదా_గోతులు మునిసిపాలిటీవాళ్ళు తవ్వుతారు. మునుపు ఎవరు తవ్వుకున్న గోతుల్లో వాళ్ళు పడేవారు. ఇప్పుడు అలా పడ్డంలేదు, ఎవరో తవ్వుకున్న గోతుల్లో ఎంచక్కా ఎవరో పడ్తుంటారు. విమర్శకులు తవ్విన గోతుల్లో రచయితలు పడుతుంటారు. రచయితలు తవ్విన గోతుల్లో పబ్లిషర్లూ, పాఠకులూ పడి దులుపుకొని లేచి తిరుగుతుంటారు. ఇదంతా వెరీసింపుల్ అర్థమెటిక్. నాకు లెక్కలు బాగా రావు. రాకపోయినా ఆన్సర్లురాని లెక్కల్ను గురించి లెక్కలురాని పిల్లల్ను గురించి బోల్డు థింక్ చేస్తుంటాను. థింక్ చేయాలోయ్ అన్నాట్ట ఇంగ్లీషువాడు. థింక్‌చేసేవాళ్ళకంటె ఇంకుచేసేవాళ్ళే మనదేశంలో ఎక్కువ. హిందీలో చావల్ ఖరాబ్ ఆద్మీ లంటారు. మనదేశంలో ఇంకుఖరాబు ఆద్మీలు చాలామంది వున్నట్లున్నారు. ఆడవారిమాటలకు అర్థాలేవేరులే అన్నాడో సినిమావాడు. మంత్రిగారి మాటలకుకూడా అంతే; మొన్నీమధ్యెవరో మినిస్ట్రిగారు ఒకే మాటకు ఒకేఅర్థం వుండాలన్నారు. మాయింట్లో దయ్యాలలాటి డిక్షనరీలు మిడిగుడ్లేసుకు చూస్తుంటాయి. అవన్నీ ఒక్క-

సారి ఉలికులికిపడ్డాయి. మాటలకు ఒకే అర్థం అంటే ఒక అర్థంవుంచి మిగతావన్నీ కొట్టెయ్యమనా— మంత్రులు చప్పుళ్ళు ఎక్కువ చేస్తారు. అవన్నీ అధికార శబ్దాలు— ఆ చప్పుళ్ళకు కుందేళ్ళు బెదరవు. (ఇంక్రిమెంట్లు జీతాలు లావుపాటి టి. ఏ.లు ఫీజులుపుచ్చుగునేవాళ్ళు బెదుర్తారు.) కొరుకుడు పడని కొత్త మాటలకు జనం బెదుర్తారు. జనం ఎప్పుడూ బెదురుగొడ్లే కనుక. అభినవ వాగనుశాసనులున్నారు. రైల్వేవాగనుశాసనులుకారు, (వేగంశాసనులు అంతకంటెకారు) అధికారభాషా వాగనుశాసనులంటారు వీళ్ళను. థింక్ చేయకుండా ఇంకు చేస్తారని ముందే చెప్పా.... ఆకటికిం గొనిపోయి అల్ల కర్ణాట కిరాట కీచకుల కమ్మ త్రిశుద్ధిగ నమ్మ భారతీ" అనేవాడొక్కడూ కనిపించడు. ఇమ్మనుజేశ్వరాధములకిచ్చి పురమ్ములు వాహనమ్ములున్, సొమ్ములు కొన్నిపుచ్చుకొని సొక్కి శరీరము వాసి కాలుచే సమ్మెట ప్రోటులన్ దినక-తినక తప్పుతుందా? ఇష్టంవచ్చినట్లు అనువాదాలు చేసేవారికి-నరకలోకపు జాగిలమ్ములు గొలుసుత్రెంచుకు వురికిపడ్తాయి- ఎవర్ని చూసి? కృతకభాషావాదులు పైశాచిక భాషను వాడి యిది సాధికారికమైన తెనుగు అని డబాయించే వాళ్ళనుచూసి .... వాళ్ళ శ్వేతపత్రాలను, బాజాలను, బాకాలను, బుకాయింపులను, రుకాయింపును చూసి వురికిపడ్తాయ్.

గోల్డుస్మిత్ అనేఆయన పిచ్చికుక్కల్నిగురించి రాసేట్ట, మావారు చెప్పారు. పిచ్చికుక్కల్నుచూసి జనం ఝుడుసుకుని పుంజాలుత్రెంపుకు పారిపోతారు. కొందరు కనబడ్డ కుక్కనల్లా "పిచ్చి నాన్ పిచ్చి"చూడకుండా తరిమి తరిమి చంపుతారు. రచనలైనా అనువాదాలైనా ఏవైనా అంతే.

అయితే గృహ ప్రభుత్వాలు (సంసారం అనే మాటకి తెలుగు వికృతం) యిలాటి విషయాల్లో దిబ్బరొట్టె టెక్నిక్‌ను వాడ్తాయి.

దిబ్బరొట్టె టెక్నిక్ అనగానేమి? అది సింపుల్ అర్థమెటిక్-దిబ్బరొట్టె విధవ్వాళ్ళ కోసం చేస్తారు? ఈ అభినవ వాగనుశాసనులు

చేసేఅనువాదాలూ అంతే. దిబ్బరొట్టె ఎవరికోసం చేస్తారో వారికోసమే ఈ అనువాదాలు. దిబ్బరొట్టె ఈజ్ నాట్ ఫర్ ఎవ్వేరీ వెంకమ్మా పుల్లమ్మా అండ్ బుచ్చెమ్మా ఆర్ రామయ్యా సుబ్బారావు అండ్ సత్యన్నారాయణ. షి మేక్స్ హర్ కేక్ ఎట్ ఏ. ఎం.ఫోర్....డాష్ – డాష్. డాష్ అండ్ యాట్సిటాల్ వితవుట్ మిస్టేక్. దిబ్బరొట్టె చేసింది చేసినట్లు మ్రింగెయ్యాలి– ఎవరూ? చేసినవారే! ఇటీజ్ ది ఖర్మా థియరీ– వెరీ సింపుల్ అర్థమెటిక్! నాకు లెక్కలు బాగా రావులెండి. తెల్గూ రాదు!